

గాజీ ఫహీముద్దీన్‌కు డాక్టరేట్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అనువాద అధ్యయనాల విభాగంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని గురువారం ప్రకటించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థి ఎం.డి.గాజీ ఫహీముద్దీన్ అనువాద అధ్యయనాల విభాగం ప్రొఫెసర్ ఖలీద్‌ముబాషిర్ ఉజ్ జాఫర్ పర్యవేక్షణలో 'ఉర్దూ మే షోబా ఈ తాలిమ్ ఓ తర్బియాత్ సే ముతాలిక్ తర్జుమా కర్దా కితాబోన్ కా తొజీహి ఇషారియా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. దీంతో ఆయనను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నేరం

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం నిషేధమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం రుద్రారం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణంలో టైర్స్ కార్మికులకు ధూమపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులు, ప్రచారంపై ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్టవిరుద్ధమని, విద్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు పొగాకు సేవించడం, ఉత్పత్తుల అమ్మకం నిషేధమన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.200 జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులు అమ్మరాదన్నారు. ప్రజలకు మైక్ సెట్, ఐసీయూ, బ్యానర్లను ఉపయోగించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాములు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వైద్య బృందంతో డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్‌రావు తదితరులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్టుగాడ్యుయేట్ స్టడీస్, ఎస్కీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో చాణక్య సెమినార్ హాల్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, మ్యాక్స్‌విజన్ వారి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు విద్యార్థులు ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువును సులభంగా అర్థం చేసుకొని, మరింతగా చదువుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం రెడ్డీస్ లేబరేటరీ, మ్యాక్స్‌విజన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉచితంగా రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎస్ కృష్ణప్రసాద్‌రావు, ఇతర అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రెడ్డీస్ లేబరేటరీ, మ్యాక్స్‌విజన్ వైద్యబృందం పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్ కాలనీ వద్ద చేపట్టిన నాలా విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్తిగా మిగిలిపోయిన నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాబోయే వర్షకాలం లోపు పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాలా విస్తరణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టడంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం వహించకుండా నాణ్యతాప్రమాణాలు చేపట్టి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈఈ శ్రీకాంతిని, డీఈ ప్రవీణ్, ఏఈ శివప్రసాద్, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు నరేందర్, సందీప్‌రెడ్డి, సీతారామయ్య, చంద్రశేఖర్, రామారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు. మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో ఉ.9:30 నుంచి మ.ఒంటిగంట వరకు మాతృశ్రీనగర్ పూర్తిగా, కల్వరి టెంపుల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'మనూ'లో సివిల్స్‌కు ఉచిత శిక్షణ

రాయదుర్గం: మనూలో సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఎస్ఈ ఆర్‌సీఏ ఇన్‌చార్జి ప్రొ.అలీమ్‌బాషా గురువారం తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(సీఎస్ఈ–ఆర్‌సీఏ) యూపీఎస్‌సీ ద్వారా మే 2023లో నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందిస్తోందన్నారు. ఇందులో పాల్గొనే వారు జనవరి 10 లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఉర్దూ యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను యూనివర్సిటీ క్యాంపస్‌లోని సీఎస్ఈ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీకి పోస్టు ద్వారా పంపవచ్చన్నారు.

హెచ్‌సీయూలో ఎన్‌సీఏఈఆర్ సదస్సు

రాయదుర్గం: అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు బలమైన ఆర్థిక ఫ్రేమ్ వర్క్ కలిగి ఉన్నాయని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసెర్చ్(ఎన్‌సీఏఈఆర్) డైరెక్టర్ జనరల్, పీఎం–ఈఏసీ సభ్యుడు డాక్టర్ పూనమ్‌గుప్తా పేర్కొన్నారు. హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, ది ఇండియన్ ఎకనమెట్రిక్ సొసైటీతో కలిసి నిర్వహిస్తున్న సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, భారత దేశం కోసం మెరుగైన ప్రపంచ ఆర్థిక భద్రత వలయాలను నిర్మించడం' అనే అంశంపై డాక్టర్ పూనమ్‌గుప్తా మాట్లాడారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సత్యంరావు అన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి పీజేఆర్ కంచుకోటగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నగరం అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. ప్రజల సమస్యలు తీర్చి, ఇళ్ల పట్టాలు అందించామని, రాజీవ్ గృహకల్ప, స్వగృహ ఇళ్లను పేదలకు అందించిందినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ తరుపున తాను ముందుండి పోరాడతానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇలియాస్ షరీఫ్, ఎండీ జమీర్, సలీం, శశికాంత్, భరత్ గాంధీరెడ్డి, ఎంపీ ముషరఫ్, ఎండీ జియా, ప్రేమ్, యాదవ్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి ఫెలోషిప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన డాక్టోరల్ విద్యార్థిని చినార్ మెహతాకు ఫుల్‌బ్రైట్-నెహ్రూ డాక్టోరల్ ఫెలోషిప్ లభించింది. హెచ్‌సీయూలోని కమ్యూనికేషన్ విభాగంలో ప్రొఫెసర్ ఉషారామన్ పర్యవేక్షణలో చినార్ మెహతా 2022–23 కాలానికి ఫుల్‌బ్రైట్ నెహ్రూ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నారు. జనవరి నుంచి ఆమె తదుపరి 9 నెలలు అమెరికాలోని పిట్స్‌బర్గ్‌లోని కార్నెగీ మెల్లన్ విశ్వవిద్యాలయం హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్ ఇన్‌స్టిట్యూట్, స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టర్ సారా ఫాక్స్ ద్వారా మార్గదర్శకత్వం వహిస్తుంది.